ఆయుర్వేద ఆసుపత్రికి సుస్తీ..!



అత్తాపూర్: హైదర్‌గూడ ఆయుర్వేద ఆసుపత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇందులో డాక్టర్, పారా మెడికల్ ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే దవాఖాన భవనానికి తలుపులు, కిటికీలు సక్రమంగా లేవు. నిత్యం అనేక మంది రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. కానీ ప్రభుత్వం ఈ ఆసుపత్రిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని రోగులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన కాంట్రాక్టర్లు

శంషాబాద్ రూరల్: పెండింగ్ బిల్లులు చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ పలువురు కాంట్రాక్టర్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శనివారం విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిన్నర నుంచి మండలం, మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన రోడ్లు, భూగర్భ మురుగు కాలువలు, భవనాల నిర్మాణాల కోసం ఖర్చు చేసిన బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం నుంచి త్వరగా బిల్లులు మంజూరయ్యేలా చూడాలని కోరినట్లు వారు తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు మరో అవకాశం



కౌంటర్ వద్ద సూచనలు చేస్తున్న కౌన్సిలర్లు

శంషాబాద్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ఈ మేరకు మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. జీరో విద్యుత్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ పొందలేని వారు మరోసారి తమ ఆధార్, రేషన్ కార్డు వంటి ధ్రువీకరణ పత్రాలు జతపర్చి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. శనివారం ప్రజాపాలన కౌంటర్ వద్ద కాంగ్రెస్ కౌన్సిలర్లు సంజయ్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్, నాయకులు తాజ్‌బాబా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు.

మున్సిపల్ కార్మికులకు బీమా కల్పించాలి



నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మణికొండ: మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని గండిపేట మండల సీఐటీయూ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఆనంద్ శనివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ. 26వేలు ఇస్తామని హామీలు ఇచ్చి మరిచారన్నారు. ఇకనైనా వాటిని అమలు చేసి కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, మహేశ్, జుబేద్, సాయి, శేఖర్, ఉదయ్, శ్రీవిద్య, అమృత, సులోచన పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల వివరాలు ఇవ్వండి



బండ్లగూడ: ప్రభుత్వ స్థలాల వివరాలు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గండిపేట తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బండ్లగూడ, సికిందర్‌గూడల్లోని ప్రభుత్వ స్థలాల రికార్డులు కావాలని గత నెల 17వ తేదీన ఆర్‌టీఐ యాక్టు కింద దరఖాస్తు చేసినప్పటికీ ఇప్పటివరకు సమాచారం అందించలేదన్నారు. సర్వే నంబర్-9 లో 7 ఎకరాల ఆరు గుంటలు, సర్వే నంబర్ 14లో ఎకరం 22 గుంటలు, సర్వే నంబర్ 15లో 7 ఎకరాల 24 గుంటల, సర్వే నంబర్ 16లోని 4 ఎకరాల 35 గుంటల వివరాలు అందించాలని కోరానని తెలిపారు.

విద్యార్థులకు చేయూతనందించాలి

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించేందుకు కార్పొరేటర్ సంస్థలు ముందుకు రావాలని సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ నవాజ్ వద్దీన్ కోరారు. సులేమాన్‌నగర్ డివిజన్ చింతల్‌మెట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్కులు, యూనిఫాంలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన అందుతుందని తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ తాహీర్, మహ్మద్ మోసిన్, మహమ్మద్ మస్కతి, ఉపాధ్యాయులు సురేందర్, శ్రీలత, లక్ష్మి, కృష్ణవేణి, మహేందర్, సంతోషి, స్వప్న తదితరులు ఉన్నారు.

సుందరంగా శిల్పారామం















మాదాపూర్: శిల్పారామం నగరవాసులను ఆకట్టుకుంటోంది. పల్లెటూరి వాతావరణాన్ని తలపిస్తుండడంతో నగరవాసులు, సందర్శకులు సరదాగా గడుపుతున్నారు. వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు శిల్పారామంలో అనువైన ప్రాంతం.పార్కింగ్ సమస్య లేదు. సాంప్రదాయ వేదిక, రాక్‌హైట్స్, మౌంటేన్‌హైట్స్, శిల్పకళావేదిక, కోనసీమ ప్రాంతాలలో నిర్వహించుకోవచ్చు.

ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఉంటుంది.పెద్దలు, చిన్నారులకు బోటింగ్, బ్యాటరీ కార్, ఎద్దుల బండి లో తిరగవచ్చు. పచ్చిక ఉండడంతో సీనియర్ సిటిజన్‌లు వాకింగ్ చేస్తూ సరదాగా గడుపుతున్నారు. చిన్నారులకు ప్రత్యేక ఆటస్థలాన్ని ఏర్పాటు చేశారు. ఉయ్యాల, బెంచేలు, జారుడు బండలు, ట్రీ హౌస్ లాంటి ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. దే శంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తయారు చేసిన హస్త కళ, చేనేత, గృహాలంకరణ ఉత్పత్తులు అందుబాటులో ఉండడంతో సందర్శకులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వివిధ దేశాలకు చెందిన తెల్లకోడులు, బాతులు, పక్షులు కనువిందు చేస్తున్నాయి.

- ఆడియో ఫంక్షన్లు, వార్షికోత్సవాలు, రిసెప్షన్‌లు అధికం
- ప్రదేశాన్ని బట్టి రేట్లు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం
- సీటింగ్ కెపాసిటీని బట్టి ఎంపిక చేసుకుంటున్న ఆర్గనైజర్స్
- సంవత్సరానికి దాదాపు 100 కార్యక్రమాలు.
- వివాహాది శుభకార్యాలకు.. రూ. 1.28 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. జీఎస్టీ ఎక్స్‌ట్రా.

నీటి ఎద్దడిని నివారించాలి



మాట్లాడుతున్న పద్మశ్రీ హిల్స్ కాలనీవాసులు

బండ్లగూడ: కాలనీలో నీటి సమస్య లేకుండా చూడాలని కోరుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పద్మశ్రీ హిల్స్‌కాలనీవాసులు కమిషనర్ శరత్‌చంద్రకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీహిల్స్ కాలనీ, ఇతర అందుబాటులో ఉన్న అనువైన స్థలాల్లో నీటి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటికే జలమండలి నుంచి అనుమతులు పొందామన్నారు. ప్రతిరోజు అపార్ట్‌మెంట్ వాసులు నీటి కోసం అదనంగా ప్రైవేట్ ట్యాంకర్ల వారికి నెలకు రూ. 50 వరకు ఖర్చు చేస్తున్నామన్నారు. నీటి సమస్య పరిష్కరించకపోతే నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. దీంతో కమిషనర్ స్పందించి జలమండలి అధికారులు, కార్పొరేటర్లు కాలనీవాసులతో వచ్చే మంగళ లేదా బుధవారాల్లో సమావేశాన్ని ఏర్పాటు చేసి స్థలం ఎంపిక చేస్తామని హామీనిచ్చారన్నారు. అందజేసిన వారిలో అమరేందర్‌రెడ్డి, సుమన్, వెంకట్‌గౌడ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్‌లో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని తన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఏలతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శానిటేషన్ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించేలా ఎస్‌ఎఫ్‌ఏలు నిఘా పెట్టాలని సూచించారు. మరిన్ని చెత్త సేకరణ రిక్షాలను అందుబాటులోకి తీసుకువస్తానని, అలాగే పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, సామేశ్ తదితరులు పాల్గొన్నారు.

పందెన్‌వాగుకు పూర్తిస్థాయిలో బాక్స్ డ్రైన్ నిర్మించండి



చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తున్న ది సిటిజన్ కౌన్సిల్ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రవహిస్తున్న పందెన్‌వాగుకు పంచవటికాలనీ వరకు బాక్స్ డ్రైన్ నిర్మించారని, దానిని పూర్తిస్థాయిలో నెక్నాంపూర్ చెరువు వరకు నిర్మించాలని మణికొండ మున్సిపాలిటీ ది సిటిజన్ కౌన్సిలర్ నాయకులు కోరారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ కోటేశ్వర్‌రావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసినప్పుడు పందెన్ వాగు పొంగిపొర్లడంతో పలు కాలనీల్లోకి నీళ్లు చేరడంతో పాటు దుర్వాసన వస్తుందన్నారు. పంచవటి కాలనీ వద్ద గతంలో మల్కం చెరువు నుంచి వచ్చే నీటిని షేక్‌పేట వైపు మళ్లించకుండా ఎత్తు పెంచి దాన్ని పందెన్‌వాగులో కలిపారన్నారు. ఎత్తు పెంచిన చోట ఓ చెక్ డ్యాం నిర్మించి అధిక మొత్తం మురుగునీటిని షేక్‌పేట వైపు మళ్లిస్తే మణికొండ మున్సిపాలిటీ ప్రజల సమస్య తీరుతుందన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని కౌన్సిల్ నాయకులు తెలిపారు. చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన వారిలో కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్ రావు, కార్యదర్శి షస్త్రక్ ఆరీఫ్ మహమ్మద్, సహాయ కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదానం

రాజేంద్రనగర్: పెండ్యాల శ్రీనివాస్ మూడో వర్ధంతి సందర్భంగా శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అనాథాశ్రమాల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే రాజేంద్రనగర్, అత్తాపూర్, మెహిదీపట్నం పరిధిలోని పలు ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న వారికి మిల్స్‌ను పంపిణీ చేశారు. బన్సీలాల్‌నగర్‌లో సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి మల్లిక్‌తో పాటు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రమాదకరం



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ తదితరులు

బండ్లగూడ: రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రమాదకరమని నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ అన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిడ్ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్ ప్రధాన రహదారిలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తున్న 11 వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై ఎన్నిసార్లు అవగాహన కల్పించిన కొందరిలో ఎలాంటి మార్పు రావడంలేదు. ఇప్పటికే చలాన్లు సైతం విధించినా మళ్లీ నిబంధనలు అతిక్రమిస్తున్నారన్నారు. వీటిని నివారించేందుకు నిరంతరం స్పెషల్ డ్రైవ్ చేపడుతామని, నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేశ్, కానిస్టేబుళ్లు ఆంజనేయు లు, లక్ష్మణ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడ సర్వేనంబర్-54లో హిమాయత్‌సాగర్ చెరువుకు సమీపంలో నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ శశాంక, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రైవేట్ వ్యక్తులకు మధ్యన వివాదాస్పదంగా ఉన్న ఈ భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపివేయాలన్నారు. జీవో నంబర్ 111 ఉల్లంఘనతో హిమాయత్‌సాగర్ జలాశయానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందజేసిన వారిలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్ (మిట్టు) నజీరుద్దీన్, పాల్సన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని విస్టా ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. పాఠశాల చైర్మన్ వెల్లంకిరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెడ్‌బాయ్, హెడ్ గర్ల్‌తోపాటు ఇతర విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే నాయకత్వం నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్రమశిక్షణ విద్యార్థులకు ఎంతో ముఖ్యమని, తప్పనిసరిగా అలవర్చుకోవాలన్నారు. అంతకుముందు విద్యార్థుల కవాతు అందరినీ ఆకట్టుకుంది. ప్రిన్సిపల్ మేరీ శాంతిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ అదుర్స్

రాయదుర్గం: నృత్యాలు, గీతాలాపనలు, పలు రకాల కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. శనివారం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయింట్ జేవియర్స్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తూ ప్లేస్‌మెంట్స్‌లో ముందున్నామని గుర్తు చేశారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యం పెంపుదలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు కళాశాల కార్యదర్శి సుధీర్ బహుమతులు అందించారు. ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

అత్తాపూర్: పాము కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతిచెందిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌నగర్‌కు చెందిన మీర్ రహ్మద్ బేగ్ కుమారుడు మీర్ అసలుబేగ్(7) కుటుంబ సభ్యులతో కలిసి నిద్రకు ఉపక్రమించాడు. ఈ నెల 19 (బుధవారం) ఉదయం 7 గంటల ప్రాంతంలో తన భుజానికి ఏదో కరిచింది అని కుటుంబ సభ్యులకు చెప్పాడు. నోటి నుంచి నురుగులు రావడం గమనించిన వారు వెంటనే నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బాలుడు శనివారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు అన్నదమ్ముల అదృశ్యం

అత్తాపూర్ : ఇద్దరు అన్నదమ్ములు అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ సీహెచ్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు వినయ్ (13), శ్రీశైలం (11) కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి వస్తుంటారు. ఇదే క్రమంలో ఈ నెల 18న సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆడుకుంటామని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితులు వద్ద గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అత్తాపూర్ పోలీస్‌స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712663404 నంబర్‌లో సంప్రదించాలని అత్తాపూర్ పోలీసులు కోరారు.

బాధ్యతల స్వీకరణ

మణికొండ: జలమండలి మణికొండ 18వ డివిజన్ జీఎంగా మూడో డివిజన్ జీఎంగా పనిచేస్తున్న ఎం. మహేందర్‌ను బదిలీ చేశారు. మణికొండలో ఇప్పటివరకు జీఎంగా పనిచేసిన జి.రవీందర్‌రెడ్డిని ఎస్‌టీపీ డివిజన్ 1కి ట్రాన్స్‌ఫర్ చేశారు. దాంతో మణికొండ జలమండలి కార్యాలయంలో నూతన జీఎం శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలోనే జీఎం రవీందర్‌రెడ్డిని బదిలీ చేసినా వేసవిలో నీటి సరఫరా విషయంలో ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంలో అనుభవజ్ఞులు ఉండాలని అప్పట్లో బదిలీ ఆదేశాలు వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతం నగరంలో పలు డివిజన్ల జీఎంల బదిలీల్లో భాగంగా ఆయనను ట్రాన్స్‌ఫర్ చేశారు.

అధ్యాపకులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మణికొండ: మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం అధ్యాపకులకు బిగ్‌డేటా అనలిటిక్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిగ్‌డేటా అనలిటిక్స్‌పై అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం వల్ల రాబోయే రోజుల్లో విద్యార్థులకు బోధిస్తారని తద్వారా వారికి ఉద్యోగావకాశాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ డాక్టర్ సీఆర్‌కే రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు